

**Only Sample Matter on Vidisha Houses from ww w.subhavaastu.com**

## విదిక్కులు – వాస్తు

మన జీవితంలో అనుభవించే ఎన్నో సమస్యలకు వాస్తు శాస్త్రం చక్కటి పరిష్కారాన్ని సూచిస్తున్నది. దిక్కులలో నిర్మించే నిర్మాణాల వాస్తు సిద్ధాంతము మరియు విదిక్కులలో నిర్మించే నిర్మాణాల వాస్తు సిద్ధాంతము పూర్తిగా వేరు. వాస్తు శాస్త్రం గురించి కూలంకషంగా ఎందరో చెప్పగలరు. అయితే విదిక్కుల విషయానికి వచ్చినప్పుడు తత్తరపాటు తప్పదు. దీనికి కారణం స్థలాలు తిరిగి ఉండడమే.

దిక్కులు ఎప్పటికీ తమ స్థానాల నుండి ప్రక్కకు వెళ్లడం కానీ లేదా మార్పు చెందడం కానీ ఉండదు. ఇటువంటి ప్రాంతములలో స్థలములు దిక్కులకు సరిగా ఉన్నప్పుడు అవి $90^0$ డిగ్రీలను సూచిస్తాయి. స్థలములు పక్కకు తిరగడం వల్లనో లేదా ప్లాట్లుగా స్థలములను విభజించు సమయంలో అజాగ్రత్త వల్లనో లేక స్థలము కోల్పోకూడదనే ఉద్దేశ్యంతో దిక్కులకు సరిగా లేకుండా ప్లాట్లను వేయడం జరుగవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో ఆ ప్లాట్లకు లేదా ఆ స్థలమునకు దిక్కులు సరిగా ఉండవు. ఈ స్థలములను విదిక్కు స్థలములు అని చెప్పవచ్చును. ఉదాహరణకు ఈ క్రింది పటమును గమనిస్తే దిక్కుల స్థలము మరియు విదిక్కుల స్థలము తెలుసుకోవచ్చు. దయచేసి ఒకసారి గమనించండి దిక్కులు ఎప్పటికీ మారవు. కేవలం స్థలములు మాత్రమే మారి విదిక్కుల స్థలములుగా చెప్పబడును.




1వ నెంబర్ పటము దిక్కులకు సరిగా ఉన్న స్థలము. 2వ నెంబర్ పటము దిక్కులకు సరిగాలేని స్థలము.

విదిక్కుల స్థలములో నిర్మాణము అత్యంత జాగ్రత్తగా చేసుకోవాలి. చిన్న పొరపాటు జరిగినా జీవితాంతం కష్టాలను అనుభవిస్తూ ఉండాలి. ఉదాహరణకు ఒక స్థలములో దక్షిణ భాగములో ఒక ఉప గృహమును లేదా స్టోర్ రూమును నిర్మించడం జరుగవచ్చు. దక్షిణ భాగంలో ఉన్న ఉప గృహం వల్ల గృహమునకు భద్రతా భావం పెరుగును ఆరోగ్యం కులాసాగా ఉండి అధిక ధనాదాయము ఉండును. ఇతరుల క్రింద పని చేయడానికి ఇష్టపడరు. గాంభీరత ఎక్కువగా ఉంటుంది. కొందరు ఒకసారి ఈ గృహస్థులకు పొగరు లేక క్రొవ్వు ఎక్కువ అనవచ్చు.


దక్షిణములో ఉప గృహము లేదా స్టోర్ రూం వేస్తున్నాము కదా అని విదిక్కు స్థలములో వేసినట్లు అయితే కోరి కొరివితో తల గొక్కున్నట్టవుతుంది. ఒకవేళ ఇలా వేసినట్లు అయితే ఆగ్నేయ భాగం మూత పడి గృహస్థులు అనేక తిప్పలు పడుదురు. కోర్టు వ్యవహారములు, అధిక ఖర్చు, రెండవ సంతానంపై దుష్ప్రభావము, అప్పుల పాలు కావడం, సంఘంలో ఉన్న మంచి పేరును పోగొట్టుకొని చెడు పేరు పొందడం, విద్య సరిగా రాకపోవడం, విద్యా భంగం జరగడం, ఇల్లు వదిలి వెళ్లిపోవాలనే ఆలోచనలు అధికం కావడం జరుగవచ్చు. ఇది తెలియక చేసిన పొరపాటు. ఇందుకు తోడు ఉత్తర ద్వారం కదా అని విదిక్కు స్థలములలో ఉత్తరమునకు ద్వారము ఉంచినట్లు అయితే అది వాయవ్య ద్వారమై నరకాన్ని కళ్లకు కట్టినట్లుగా చూపును. ఈ పొరపాటు పనికి జైలుకు వెళ్లడం, సన్యాసత్వమును స్వీకరించాలనే కోరిక బలీయం కావడం, ఇంటి పట్టున సరిగా ఉండకపోవడం, పగలు భయంగా ఉండడం, రాత్రి కాస్త ధైర్యంగా ఉండడం, ఒక సమస్య వదిలింది కదా అని అనుకునేంతలో ఇంకొక సమస్య వచ్చి చేరడం, అప్పులు అధికమై పీడనకు (ఒత్తిడికి) గురి కావడం, కుటుంబ సభ్యుల్లో పేచీలు, ఒకరు చేసే పనులు ఇంకొకరికి సరిగా నచ్చకపోవడం, తద్వారా గొడవలు అధికమైపోవడం, ఆస్తి తగాదాలు, వ్యవహారాలు, భాగస్వాములతో పేచీలు, రోజు రోజుకు కుటుంబ పరిస్థితులు దిగజారిపోవడం జరుగుతుంది.


**Contact Suresh for more info and Vastu Programmes: 09848114778..peegeess@gmail.com**

ఉత్తరములో సెప్టిక్ ట్యాంక్ (మరుగుదొడ్డి గుంత) కట్టడం పరిపాటి. ఉత్తరములో సెప్టిక్ ట్యాంక్ నిర్మిస్తున్నాము కదా అని విదిక్కు స్థలాలలో సెప్టిక్ ట్యాంక్ నిర్మించుకున్నట్లు అయితే అప్పుల పాలు అవ్వడం, తగాదాలు ఎక్కువ కావడం, వ్యాధుల బాధలు, శత్రువు పీడలు, స్త్రీలు అకారణంగా బాధలకు గురి కావడం, మానసికంగా మనిషి హతమారిపోవడం, పిచ్చి పట్టిపోవడం, ఆత్మహత్య చేసుకోవాలని పదే పదే ప్రయత్నాలు చేయడం, ప్రేమ వ్యవహారాలు, సాదారణంగా ఇతరులతో శత్రుత్వాలు కలిగి ఉండడం, ఇల్లు వదిలి వెళ్లిపోవడం, ఆస్తులు అమ్ముకోవడం, ఇల్లు వేలానికి రావడం, జప్తు కావడం సంభవించడం జరుగును.

వీటికి తోడు ఈశాన్య దోషాలు ఉన్నట్లు అయితే (అనగా ఈశాన్యములో మెట్లు ఉండడం లేదా బండరాళ్లు ఉండడం) కుమారుడు ఇల్లు వదిలి పారిపోవడం, స్థిరమైన ఆలోచనలు లేక ఏ పని కూడా సక్రమంగా చేయకపోవడం, చుట్టు ప్రక్కల వారి దగ్గర ఉన్న విలువ కోల్పోతూ ఉండడం, మతి భ్రమనం, అనారోగ్యాలతో వైద్యుల దగ్గరకు పదే పదే వెళ్లడం జరుగును.


దక్షిణ ద్వారము మంచిది కదా అని విదిక్కులలో దక్షిణము అనుకొని ద్వారమును ఉంచినట్లు అయితే అది ఆగ్నేయ ద్వారము కాగలదు. ఆగ్నేయ ద్వారాలు మనిషిని కాల్చేంత వరకు వదలవు. ఉదాహరణకు ఉద్రేకం కట్టలు తెంచుకొని రావడం, ఏ పని కూడా సక్రమంగా జరుగకపోగా బాగా ఆలస్యమైపోవడం, ఇతరుల జాలి కోసం తాపత్రయ పడడం, మంచి పని చేయడానికి పూనుకుంటే అది ఎదురు తిరిగి చెడు పేరును తీసుకురావడం, ఇంటిలో ఉన్న భాగ్యం (ధనము, బంగారం) కరిగి పోవడం, దొంగల భయం, అగ్ని ప్రమాదాలు, తన మానాన తను వెళ్తూ ఉంటే యాక్సిడెంట్లు కావడం, ఎప్పుడూ గొడవలు జరుగుతూ ఉండడం, మనిషిని చికాకు పెట్టడం, ఐశ్వర్యంతో తులతూగుతున్న సంస్థ కూడా ఆదుకునే వారు కరువైనట్లుగా మారి వెలుగు నశించిపోవడం, అనర్థాలు అధికమైపోవడం, పురుషులు భ్రష్టు పట్టి స్త్రీలు పెత్తనం చెలాయించడం జరుగును. దీనిని పటము రూపకముగా గమనించండి.








చూడడానికి రెండు పటాలు ఒకేలాగా ఉన్నా రెండవ గృహము విదిక్కులో నిర్మించినది. తూర్పు, దక్షిణమునకు మధ్యలో ఆగ్నేయము ఉంటుంది. రెండవ పటము గృహమునకు ఆగ్నేయ తలుపును గమనించవచ్చు. ఇది మహాప్రమాదకారి. ఆలస్యంగానైనా ఆస్థులను అమ్మించేంతవరకు వదలదు. ప్రతి దినము యాతనకు గురి కావాల్సిందే.

కొన్ని నిర్మాణ క్రమములను గమనిద్దాము.




ఒక గృహము ఇలా నిర్మించబడి ఉంది. ఇప్పుడు దీని ఫలితాలను గమనిద్దాము. ఈ మొత్తం స్థలమును రెండు సమ భాగములుగా విభజించినట్లయితే ఒకటి వాయవ్య భాగముగానూ, రెండు ఆగ్నేయ భాగముగానూ చెప్పుకోవచ్చును.




గృహమును వాయవ్య భాగములో నిర్మించుకోవడం జరిగింది. ఖాళీ స్థలము ఆగ్నేయ భాగమవుతుంది.

**వ్యవహారాలు :-**

ఈ గృహములోని వారు ఒక సమస్యను పరిష్కరించుకునేంతలో ఇంకో సమస్య సిద్ధంగా ఉంటుంది. వ్యవహారాలు సమసి పోయినట్లుగా కనిపిస్తున్నా ముగింపు ఉండదు. నష్టాన్ని ఎప్పుడూ చవి చూస్తూండాలి. మానసికంగా బాగా కృంగిపోయే సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కోర్టు వ్యవహారములు బాగా ఉంటాయి. సాధారణంగా సమసిపోయే విషయాలు కూడా గొడవలకు దారి తీస్తూ ముగుస్తుంటాయి.

**వ్యాపారం :-**

వీరు పెట్టుబడుల తరహా వ్యాపారము అసలుకు చేయరాదు. ఉదాహరణకు షేర్ల వ్యాపారము, సరుకు నిల్వ చేసి లాభానికి అమ్ముకునే వ్యాపారం చేసిన నష్టాల పాలవ్వడం జరుగును. భాగస్వామ్య వ్యాపారము ఎంత మాత్రమూ పనికి రాదు. ఆర్థిక నష్టాలు అధికంగా ఉంటాయి. ఒకవేళ వీరికి ఏ విషయంలోనైనా కలిసి వచ్చినట్లుగా కనిపించిననూ అది అంతంత మాత్రమే. వ్యాపార భద్రతా భావము ఎప్పటికీ ప్రశ్నార్థకముగా ఉంటుంది. నిల్వ చేసిన సరుకు కాలిపోయే ప్రమాదం కూడా కనిపిస్తుంది. దగ్గర పని చేసే వారు నమ్మక ద్రోహం చేసి నష్టాన్ని మరియు మానసిక క్షోభకు గురి చేయుదురు. ప్రహారీ నుంచి బయటకు వెళ్లడానికి ఇంతకు మునుపు చూసినట్లుగా ఆగ్నేయ ద్వారము ఉన్నట్లు అయితే కౄర మనసత్వాన్ని కలిగి ఉండే అవకాశము అధికము. వ్యాపారంలో మోసం చేసి సంపాదించుకుందామని యుక్తులు పన్ని పరాభవానికి గురి అగుదురు. పటములో చూపినట్లుగా ఉత్తరము మరియు తూర్పు మధ్యన ప్రహారీ గేటు ఉన్నట్లు అయితే నష్టాలు తగ్గి ఒకింత మనశ్శాంతిగా జీవనము సాగింతురు. వ్యాపార లెక్కల్లో ఎప్పటికీ తేడాలు వస్తూ ఉంటాయి. సంవత్సరాలు గడిచిన తర్వాత ఏనుగులాంటి సంస్థ పీనుగులాగా తయారు అవుతుంది. చూస్తుండగానే ఆస్థులు కరిగి పోతాయి.

**కుటుంబం :-**

సంతోషము, దుంఖఃము రెండూ సమపాళ్ళలో ఉంటాయి. అయితే సంతోషము ఎక్కువ కాలం నిలవదు. కుటుంబ సభ్యుల్లో ఒకరి మాటకు ఒకరు విలువను ఇవ్వరు. ఎదుటి వారి తప్పులు ఎంచడం కోసం సదాసిద్ధంగా ఉంటారు. కీచులాటలు, కొట్లాటలు, తన్నుకోవడాలు, సాధారణంగా కనిపించవచ్చును. అపనమ్మకము అధికమై విడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇటువంటి గృహములలో ముండమోపులు ఉండే అవకాశము ఎక్కువ. పెళ్లి అయి అత్తారింటికి వెళ్లిన ఆడబిడ్డ ఏదో ఒక కారణంచే పుట్టింట్లో ఉండిపోయే అవకాశము ఎక్కువ.

ఈ గృహములో ఇంటి ఎదురుగా నీళ్ల గుంత ఉన్నట్లు అయితే కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లకు వెళ్లడం, అరెస్టులు కావడం, వ్యభిచరించడం, రెండవ పెళ్లి చేసుకోవడం లేదా ఉంపుడుగత్తెలు ఉండడం జరుగుతుంది.

నీళ్ల గుంత పటములో చూపిన విధంగా ఇంటి ప్రహారీలో తూర్పు వైపున ఉన్నట్లు అయితే వ్యవహారములలో విజయము రావడం జరుగవచ్చు. ఒక్కోసారి ప్రతి ఒక్క చిన్న విషయానికి గొడవలు పెట్టుకొని సాధించే వ్యక్తులు ఉండవచ్చును. లేదా గొడవలకు పెద్ద మనిషిగా వ్యవహరించే పరిస్థితి రావచ్చు. ఇటువంటి గృహాలలో ఒక్కోసారి అమాయకత్వం కలిగిన వారు ఎక్కువగా ఉంటారు. ఒకప్రక్క మంచివాడని పొగిడి ఇంకో ప్రక్క గుంతలు తీసే వ్యక్తులు ఈ కుటుంబ సభ్యులకు అనుభవంలోనికి రావచ్చు.

**సంతానము :-**

చదువులలో బాగా వెనుకబడి ఉంటారు. ఒకవేళ బాగా చదివిననూ అర్హతకు తగిన ఉద్యోగము లభించడం చాలా కష్టము. జులాయిగా తిరగడం, చెడు సావాసాలు పట్టడం, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడం ఎక్కువగా కనిపిస్తుంది. ఇల్లు వదిలి పెట్టి పారిపోవాలని పిల్లలకు ఎక్కువగా తోస్తూ ఉంటుంది. వీరికి అందుబాటులో ఎప్పటికీ అధిక ధనం ఉంచరాదు. చెడు వ్యసనాల జోలికి ఎక్కువగా వెళ్లడం జరుగుతుంది. కాని పనులు చేసి సమాజంలో కుటుంబానికి చెడు పేరు తీసుకువస్తారు. ఇతరుల ప్రేమ వచనాలకు ఆడ పిల్లలు త్వరగా ఆకర్షింపబడే ప్రమాదము అధికము.


**విద్య :-**

పెద్ద చదువులు చదివిన వారు ఈ ఇంట అరుదుగా ఉంటారు. నకిలీల మాయలో పడే అవకాశము అధికముగా ఉంటుంది.

**ఆరోగ్యం :-**

చీటికీ మాటికీ ఆరోగ్య విషయంలో చింత చేయాల్సిన పరిస్థితులు ఉంటాయి. డాక్టర్ల చుట్టూ ఎక్కువగా తిరిగే అవకాశముంది. వచ్చిన రోగము అధికంగా ధనాన్ని ఖర్చు పెట్టించి మాత్రమే వదులుతుంది. ఇంటి ఆడవారికి శని చుట్టుకున్నట్లుగా ఎప్పుడూ ఏదో ఒక అనారోగ్యం పీడిస్తుంటుంది. మానసిక చింతతో ఎక్కువగా నలిగిపోయే అవకాశముంది. ఇతరులను చూసి ఓర్వలేని తనము ఎక్కువగా ఉంటుంది.


**అతి ముఖ్యమైన ద్వారముల గురించి తెలుసుకుందాము :-**





ప్రహారీ మధ్యన ఒక గీత ఉండడాన్ని చూడవచ్చు. తూర్పు నుంచి దక్షిణమునకు మధ్య పాయింట్ కోసం గీచిన గీత ఇది. 1వ నెంబర్ ప్రాంతంలో ద్వారము వచ్చిన అది తూర్పు ఆగ్నేయ ద్వారము కాగలదు. అధిక ఖర్చు, గొడవలు, ఆస్థి

తగాదాలు, పెట్టుబడులపై అధిక మొత్తాలు పెట్టుబడి పెట్టి చేతులు కాల్చుకోవడం, మోసాలకు పాల్పడడం లేదా మోసపోవడం, ఇతరుల సానుభూతి కోసం ప్రాకులాడడం, ప్రతి ఒక్క విషయమూ తెలుసునని ప్రగల్భాలుపోవడం, అవసరమైన సమయంలో సరియైన నిర్ణయం తీసుకోక నష్టపోయి అందరి మధ్య నవ్వుల పాలు కావడం జరుగుతుంది.


2వ నెంబర్ గల ప్రాంతంలో తలుపు ఉన్నట్లు అయితే కొంతలో కొంత నయం. వ్యవహారాలు అనుకూలంగా మారే అవకాశము, ఎన్ని కష్టాలు ఉన్ననూ ఇంట శుభకార్యము జరుగడం, శ్రేయస్సు కోరే వారు కొందరైనా ఉండడం, ధనము కాస్త నిల్వ కలిగి ఉండడం జరుగవచ్చు.




1వ నెంబర్ ప్రాంతంలో ద్వారము వచ్చినట్లు అయితే ధనము రావడం జరిగిననూ ఖర్చు అధికంగా ఉంటుంది. ఈ ద్వారము మధ్య గీత గీచిన ప్రాంతము దగ్గరగా ఉన్నట్లు అయితే ఖర్చు బాగా తగ్గే అవకాశము ఉంది. 2వ నెంబర్ ప్రాంతములో ద్వారము వచ్చినట్లు అయితే వ్యవహార విజయము ప్రాప్తించవచ్చు. పిల్లలకు విద్య కూడా బాగా వచ్చే అవకాశముంది.




ద్వారము ఈ పై మేరకు ప్రాంతములో 1 లేదా 2వ నెంబర్ ప్రాంతంలో ఎక్కడ ఉంచిననూ ప్రమాదం తప్పదు. ఆర్థిక నష్టము, అనారోగ్యాలు, ఒక్కోసారి మరణాలు, ఇటువంటి కొన్ని గృహాలలో హత్యలకు గురి కావడము లేదా కిరాయి పనులు చేసే మనుషులు ఉండడం జరుగుతుంది. రహస్య జీవనాన్ని గడపడానికి ఎక్కువ మక్కువ చూపుతారు. మాంసాహారము అధికంగా తీసుకోవడం, మసాలాలు ఎక్కువగా భుజించాలని కోరిక రావడం, ఇటువంటి గృహాలలో ఇంట బంగారు నిలువదు. బూతులు ఎక్కువగా మాట్లాడేవారు అధికంగా ఉంటారు. ఇంట మొదటి సంతానముపై దుష్ప్రభావము అధికంగా ఉంటుంది.




1వ నెంబర్ ప్రాంతంలో ద్వారము ఉన్నట్లు అయితే పరమ దరిద్ర్య గృహముగా ఈ గృహాన్ని చెప్పుకోవచ్చు. సర్వ అరిష్టాల గృహము. ఎప్పుడూ గొడవలు, కోర్టు వ్యవహారాలు, మానసికంగా కృంగిపోయే పరిస్థితులు అధికంగా ఎదురు కావడం, ఇతరులకు పూచీ పడి ఆర్థిక నష్టము మరియు పేరు పోగొట్టుకోవడం, ప్రమాణాలు అధికంగా చేయడం, అబద్ధాలు మాట్లాడడం, లేనిది ఉన్నట్లుగా చెప్పడం, మోసాలు చేసి చిక్కి పోవడం, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం, కుటుంబ సభ్యుల మధ్యలో సఖ్యత ఎంత మాత్రమూ లేకపోవడం, రాత్రి ధైర్యంగా ఉండడం, పగలు భయపడడము, సూర్యాస్తమయము తర్వాత మాత్రమే బయటకు వెళ్లడము, చిన్న పెట్టుబడులు కలిసి వచ్చి పెద్ద మొత్తాలలో పెట్టుబడులు పెట్టి చేతులు కాల్చుకోవడం, పరాయి స్త్రీలపై మోజు అధికంగా ఉండడం, అనుభవించాలనే కోరిక ఎక్కువ కావడం, ఎవరికీ తెలియకుండా చెడు వ్యసనాలు కొనసాగించడం, అతి తక్కువ మంది స్నేహితులను కలిగి ఉండడం, ప్రాణ స్నేహితులతో కూడా ఆర్థిక పరమైన విషయాలలో విభేదాలు రావడం, వారిని పోగొట్టుకోవడం, కొన్ని దినాలు దేవుడు ఉన్నాడని అధికంగా దేవాలయాల చుట్టూ తిరగడం, కొన్ని రోజులు దేవుడు లేడని భావించడం, ఇంటికి కాని వారు ఎవరు వస్తారోనని భయం భయంగా గడపడం, అధిక ఆకలిని కలిగి ఉండడం, దరిద్ర్యము, అడగకూడని వారి దగ్గర కూడా అప్పు తీసుకోవడం, సరియైన సమయానికి ఇవ్వకపోగా వారిచే మాటలు పడి అవమాన భారంతో కృంగిపోవడం, ఆవేశం అధికంగా ఉండడం, అతి ముఖ్యమైన నిర్ణయాలను ఆవేశంలో ఉండగా తీసుకొని భారీగా నష్టపోవడం, ఇతరుల క్రౌర్యానికి జరిగిన మోసానికి గురి అయి మౌనంగా అనుభవించి లోలోపల కుమిలి పోవడం, కాని పనుల జోలికి వెళ్లి అందరి మధ్య అవమానాలు పొందడం జరుగును.


ఇదే గృహానికి పడమర పల్లము ఉన్నట్లు అయితే ఏ పాపము ఎరుగక పోయినా ఇతరుల దుష్ట బుద్ధికి బలైపోవడం, ఆర్థికంగా దివాలు తీయడం, కిరాయి హంతకులను ఎదుర్కోవాల్సి రావడం, సంతాన నష్టము, అప్రతిష్ఠ, తరాలు మారినా అభివృద్ధిని చూడలేకపోవడం, జీవచ్ఛవాలుగా మిగిలి పోవడం, వయస్సులో ఉన్న వారు ఆత్మహత్యలు చేసుకోవాలని అధికంగా భావించడం, ఒక్కోసారి ఆత్మహత్య కావించుకోవడం, ప్రభుత్వ సంస్థల నుంచి అనేక సమస్యలను ఎదుర్కోవడం, తాఖీదులు పదే పదే రావడం లాంటివి జరుగవచ్చును. పరిష్కారం కాని సమస్యలచే పీడింప పడడం ఉంటుంది.

పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం, వారి భవిష్యత్తుపై మనోవ్యాకులత ఏర్పడడం, నోటి నుండి మాట స్పష్టంగా రాకపోవడం, అపజయాలు ఎక్కువగా ఉంటాయి. భార్య ఉన్ననూ పరాయి స్త్రీలతో అక్రమ సంబంధాలు ఏర్పరుచుకోవడం జరుగుతుంది. అతిగా ఆవేశానికి లోను కావడం, ఆవేశంలోనే తీసుకోకూడని నిర్ణయాలు తీసుకొని జీవితాంతం వేధనకు గురి కావడం జరుగును.

పటములో 2వ నెంబర్ ప్రాంతంలో ద్వారము ఉన్నట్లు అయితే వ్యవహారాలు ఉన్నప్పటికీ విజయం సంప్రాప్తించే అవకాశం ఉంది. జనాకర్షణ ఉంటుంది. పెద్ద ప్రమాదాలు జరుగకుండా కాపాడుతుంది. ఉదాహరణకు రోడ్డు ప్రమాదాలు, శత్రువుల దాడుల నుంచి కాపాడుతుంది.

Only Sample Matter on Vidisha Houses from ww w.subhavaastu.com


**ఈ గృహానికి వీధిపోటు ఉన్నట్లు అయితే :-**





ఈ విధమైన ఒక వీధిపోటు అనునది ఈ గృహమునకు తగులుతున్నట్లు అయితే ఎన్నో చెడులన్నింటినీ తొలగించి మంచి చేసే అవకాశం చాలా ఉంది. ఈ వీధిపోటును ఈశాన్య వీధిపోటు అని తెలుసుకోవాలి. కుటుంబ సభ్యులకు ప్రశాంత జీవితాన్ని ఇవ్వడానికి ఈ వీధి ఎంతగానో దోహదం చేస్తుంది. ఇంట అభివృద్ధి బాగా ఉంటుంది. తలచిన పనులు బాగా జరుగును. పిల్లలు బాగా అభివృద్ధిలోకి వస్తారు. ఉన్న ఆస్థులకు మించి ఇతర ఆస్థులను సంపాదించెదురు.

**కొన్ని స్థలములు మరియు పరిశీలనలు :-**

దిక్కులలోనైనా కానీ లేదా విదిక్కులలో అయినా కానీ రెండు రకాలైన స్థలములు మాత్రమే ఉంటాయి. ఒకటి చతురస్రాకారం మరోకటి దీర్ఘచతురస్రాకారం. అయితే దిక్కులకు మరియు విదిక్కులకు చాలా తేడా కలదు.








విదిక్కుల విషయాలకు వస్తే దీర్ఘచతురస్రాకార స్థలముల విషయములలో రెండు రకాలు గోచరిస్తాయి. అందులో ఇలా పై చెప్పుకున్న 1 మరియు 2 స్థలాలు. ఉత్తరము తను ఉన్న స్థానం నుంచి $45^0$ డిగ్రీలు వెనుకకు వెళ్లినట్లు అయితే అనగా $315^0$ డిగ్రీలలో ఉత్తరము ఉన్నట్లు అయితే ఆ స్థలమును ఉత్తమమైనదిగా చెప్పుకోవచ్చు. అలా కాకుండా ఉత్తరం తన స్థలము నుంచి $45^0$+గా జరిగినట్లు అయితే అది గొప్ప ఫలితాలు ఇచ్చే స్థలం కాదని తెలుసుకోవాలి. పై పటములలో 1వ పటము - (మైనస్) $45^0$ డీగ్రీలు జరిగిన స్థలము. 2వ పటము + (ప్లస్) $45^0$ డిగ్రీలకు జరిగిన స్థలము.

1వ స్థలము విదిక్కుల విషయానికి వస్తే మంచి స్థలముగా తెలుసుకోవాలి. 2వ స్థలము మంచి ఫలితాలు ఇచ్చే స్థలము కాదు.

1వ స్థలము యొక్క గుణముల గురించి తెలుసుకుందాము. ఈ స్థలము ఈశాన్యము మరియు నైరుతి లాగినట్లుగా ఉంటుంది. ఈశాన్యము పెరగడము గానో లేదా నైరుతి పెరగడంలాగానో ఉంటుంది. చిన్న ఉపాయం చేసి ఇందులో వాస్తు శాస్త్ర రీత్యా నిర్మించుకున్నట్లు అయితే ఊహించరాని మంచి ఫలితాలను పొందవచ్చు. ఈ స్థలమును రెండు సమ భాగములుగా విభజించుకున్నట్లు అయితే ఒకటి ఈశాన్య భాగము, రెండు నైరుతి భాగముగా తెలుసుకోవాలి. ఈశాన్య భాగములో నిర్మాణం చేయరాదు.


Contact Suresh for more info and Vastu Programmes: 09848114778..peegeess@gmail.com




ఈశాన్య భాగములో నిర్మాణం చేసినట్లు అయితే కొండలాంటి వ్యాపార సంస్థ కూడా పీనుగులాగా తయారు కాక తప్పదు. వ్యాపారం అద్భుతంగా జరుగుతున్ననూ ఊహించని కష్టాలు ఎదురై చివరికి సంస్థ మూత పడే పరిస్థితికి వస్తుంది. ఇచ్చిన బాకీలు తిరిగి రాక కట్టవలసిన అప్పుల వారి గోల అధికమై అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి ఉంటుంది. మానసిక వ్యాకులత, అనారోగ్యాలు, అర్థాంతర చావులు జరుగవచ్చు.

నైరుతి భాగములో నిర్మాణం చేసినట్లు అయితే ఈశాన్య భాగమంతయూ ఖాళీగా ఉండి దినదినాభివృద్ధిలా వ్యాపారము అద్భుతంగా జరిగి ధనవంతులుగా కీర్తింపబడుదురు. పది మందిలో గుర్తింపు వచ్చును. బ్యాంకుల యందు డిపాజిట్లు ఉండడం జరుగుతుంది. కొత్త స్థలాలు కొనడానికై ఎక్కువగా మోజు చూపుతారు. దూర ప్రాంత ప్రయాణాలు మరియు అందు మంచి లాభాలు తథ్యము. విదేశీయాన భాగ్యము లభిస్తుంది. తెలివి తేటలు బాగా అధికంగా ఉంటాయి. ఉన్నత విద్య లభిస్తుంది. పిల్లలు విద్యలో బాగా రాణిస్తారు.

**ఉదాహరణకు ఒక గృహమును పరిశీలిద్దాము :-**








నైరుతి రోడ్డు గల గృహము. ఈ గృహము వారు రోడ్డుకు హాలును ఏర్పాటు చేసుకున్నారు. హాలు తరువాత లివింగ్ మరియు బెడ్ రూంను ఏర్పాటు చేసుకున్నారు. పై భాగంలో ఒక మూలకు వంట గదిని (తూర్పు ప్రక్కగా), ఇంకొక మూలకు లెట్రీన్ మరియు బాత్ రూం ఉండడమైనది. వాస్తు శాస్త్ర రీత్యా ఈ ఇంటి పరిస్థితిని గమనిద్దాము. ఉచ్చంలో


ఉండవలసిన నైరుతి హాలు పేరుతో నీచంలో పడి పోయింది. అనగా తక్కువ వాడుకగల గదిగా మిగిలిపోయింది. తద్వారా నైరుతి బలాన్ని కోల్పోయింది. రెండవ గది లివింగ్ మరియు బెడ్ రూం. ఇవి సాధారణమైనవి మరియు ఈ గది యందు బెడ్ రూంగా కూడా వాడుక చేసుకోవడం వల్ల ఆగ్నేయ భాగంలో లేదా వాయవ్య భాగంలోనో నిదురించినట్లు తెలుస్తున్నది. వంట గది తూర్పు భాగమునకు చేరినది. ఉత్తర భాగములో లెట్రీన్ ఉండిపోయినది. సరియైన ఈశాన్య భాగములో బాత్ రూం నిర్మించడం జరిగినది. వాస్తు శాస్త్ర రీత్యా ఈ నిర్మాణము చాలా తప్పిదము. ధనము (ఉత్తరము), భాగ్యము (ఈశాన్యము), కీర్తి (తూర్పు) రావలసిన ప్రాంతములన్నింటినీ నిర్మాణాల పేరుతో మూసి వేయడం జరిగింది. ఏ భాగమైతే మూత పడి భద్రత కగిలి ఉండవలసి ఉందో ఆ ప్రాంతములో హాలు పేరుతో విశాలత్వమును సంతరించుకొని అభద్రతా భావము ఉండులాగున నిర్మాణము ఏర్పడినది. ఈ నిర్మాణము వల్ల జరుగబోయే పరిణామముల గురించి తెలుసుకుందాము.

1. **వ్యాపారము :-** కొద్ది రోజులు వ్యాపారము బాగుగా జరిగిననూ సంస్థ కుంటు పడక తప్పదు. ఎక్కువ సంవత్సరాలు గడిచిన తర్వాత ఒక్కొక్కసారి దివాళా తీసే పరిస్థితులు కూడా దాపురించవచ్చు. వ్యాపార సంస్థ అప్పుల పాలు కావడము పని వారి చేతిలో బందీ కావడము, అవసరార్థమై తెచ్చుకున్న చేబదుళ్లు కూడా అప్పులుగా పరిణమించి అవి ఎంత ప్రయత్నము చేసిననూ తీరక విరక్తి భావన ఏర్పడడము జరుగుతుంది. అయితే వీరికి కొద్ది రోజులు వ్యాపారము బాగా జరుగవచ్చు. అధిక ఖర్చులను భరించలేక మానసిక క్షోభకు గురి కావడం జరుగును. ఎంత ఆదాయము వచ్చిననూ, ఇతరత్రా ఆదాయ వనరులు సంవృద్ధిగా ఉన్ననూ ఖర్చులను తట్టుకోవడానికి తలను పట్టుకోవాల్సిన పరిస్థితులు వస్తాయి. అధికారుల వేధింపులు ఉంటాయి. జీవన భృతిపై దెబ్బ పడడం, బ్రతుకు పోరాటంకై సిద్ధం కావడం జరుగును.

2. **ఆరోగ్యం :-** ఎప్పుడూ ఏదో ఒక రోగంచే పీడింపబడడం, అంతా బాగుగా జరుగుతోంది అనుకునే సమయానికి హఠాత్తుగా బాగా తిరిగి పని చేసే వారు కాలం చేయడం జరిగి కుటుంబ పోషణకు ఇతరత్రా మార్గాల కోసం వెతకవలసిన పరిస్థితులు సంక్రమిస్తాయి. అనారోగ్యాలకు గురై రోగాలతో పీడింపబడుతూ చావు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసే వ్యక్తులు ఇంటిలో ఉండడం జరుగును. పక్షవాతంతో బాధపడడం, వెన్నునొప్పిచే బాధపడడం, ఎందుకూ పనికి రాకుండా పోవడంలాగా ఆరోగ్యం దెబ్బ తీయడం జరుగుతుంది.


ఈ గృహానికి ఆగ్నేయ దోషములు అనగా లివింగ్ మరియు బెడ్ రూం అని చూపించిన గది వెడల్పు అధికమై పొడవు తక్కువగా ఉన్నప్పుడు ఆగ్నేయ దోషములు ఏర్పడే అవకాశముంది. కావున ఇటువంటి గృహాలు నిర్మించు సమయంలో అనుభవజ్ఞులచే మాత్రమే గృహ నిర్మాణ ప్లానులను పొందాలి. ఈ ఆగ్నేయ దోషాల గురించి ఇక్కడ కాస్త తెలుసుకుందాము.





ఇక్కడ కనిపిస్తున్న రెండు పటములూ ఒక గదికి సంబంధించినవే. ఈ నిర్మాణ విధము ఏ మాత్రమూ దోషము లేదని భావించవచ్చు. అయితే మోడల్ నెం.1 గదికి ఏ దోషమూ లేదు. మోడల్ నెం. 2 గదికి దోషము కలదు. కొన్ని దోషములు కంటికి కనిపించవచ్చు. కొన్ని దోషములు దృష్టికి గోచరించవు. అటువంటి అగోచరమైన దోషము కలిగినదే మోడల్ నెం. 2 గది. ఈ దోషము ఖచ్చితంగా ఎక్కడ ఉందో ఇప్పుడు చూద్దాము.

Contact Suresh for more info and Vastu Programmes: 09848114778..peegeess@gmail.com




మోడల్ నెం.1లో పై భాగము ఈశాన్యమై క్రింది భాగము నైరుతిగా ఉన్నది. ఈ కొలత 15" అడుగులు. వాయవ్యము మరియు ఆగ్నేయము కొలత 10 అడుగులు. దీని అర్థము ఏమంటే ఈ గదికి ఈశాన్యము హెచ్చు అయినది. లేదా నైరుతి హెచ్చు అయినదిగా అనుకోవచ్చు. నైరుతి ప్రాంతంలో పడక ఏర్పాటు చేసుకున్నట్లు అయితే అధికమైన ఈశాన్యము మొత్తం బలమును సంపూర్తిగా పొందవచ్చు. ఈశాన్యము ఎంత ఖాళీగా ఉంటే అంత మంచిదని మీకు బాగా తెలుసు కదా! ఈ గదికి వ్యవహారాలు కలిగించే ఆగ్నేయ వాయవ్య కొలతలు తక్కువగా ఉండడము శుభ సూచికము కదా! కావున ఈ పద్ధతిగా గల నిర్మాణము యోగించును.

మోడల్ నెం.2 :- ఈశాన్య నైరుతి కొలతలు 8 అడుగులు. వాయవ్య ఆగ్నేయ కొలతలు 15 అడుగులు. తద్వారా వ్యవహారాలు కలిగించే వాయవ్య ఆగ్నేయ భాగాలు ఎక్కువై చెడు చేయు అవకాశము బాగా మెండు. శుభ ఫలితాలు అందించే ఈశాన్యము తగ్గిపోయినట్లుగా స్పష్టంగా అర్థమవుతున్నది. ఎలా అనగా ఈశాన్య నైరుతి కొలతలు 8" అడుగులు మాత్రమే. కావున శుభ ఫలితాలు పొందడం కష్టంగా తెలుస్తున్నది.

**తద్వారా వచ్చే ఫలితాలు :-** వ్యవహారాలు అధికంగా ఉండడం, నష్టాలు ఎక్కువగా ఏర్పడడం, కోర్టు కేసులు నెత్తికి చుట్టుకోవడం, వ్యాపార లావాదేవీలలో ఎప్పుడూ ఏదో ఒక పేచీ ఏర్పడటం, భాగస్వామ్య వ్యాపారాలు ఎంత మాత్రమూ కలిసి రాకుండా పోవడం జరుగును. గృహములో అత్తా కోడళ్ల మధ్యలో సరియైన పొత్తు ఉండదు. వీరి కీచులాటలతో మగవాళ్లు అధికంగా బాధ పడడం జరుగును. గృహములో ఒకరిని చూస్తే ఒకరికి సరిపోకపోవచ్చు. ఒకరి అభిప్రాయాలతో ఇంకొకరు ఏకీభవించరు. ఇంటి నుంచి పెళ్లై వెళ్లిన ఆడబిడ్డ ఏదో ఒక కారణంచే గృహానికి అధికంగా రావడం జరుగుతుంది. ఆడబిడ్డ మెట్టినింటి విషయంలో పంచాయితీలు చేయవలసి రావచ్చు. ఎప్పుడూ ఏదో ఒక సమస్యచే గృహములోని వారు బాధ పడుతూ ఉండడం జరుగుతుంది.

పరిష్కారం కాని సమస్యలతో గృహస్థులు నలిగి పోవచ్చు. ఇతరులు చూపించే జాలి మాటల కోసమై తాపత్రయ పడడం జరుగుతుంది. గొడవలు అధికంగా జరుగవచ్చు. బలహీనత అధికమై వేధించడం జరుగుతుంది. పోరాట శక్తి తగ్గిపోతూ వస్తుంది. మంచి చేసిననూ చెడుగా పరిణమించి అవమానం జరిగే అవకాశము ఎక్కువగా గోచరిస్తుంది. అధిక ఖర్చులకు లొంగిపోక తప్పదు. సమయానికి చేతికి రావాల్సిన ధనము దక్కక నానా తిప్పలు పడాల్సి ఉంటుంది. బ్లెడ్ ప్రజర్ (అధిక రక్తపోటు)చే బాధపడడం ఉంటుంది. స్నేహితులు తక్కువగా ఉందురు. ఒకవేళ ఎక్కువ మంది స్నేహితులు ఉన్ననూ ఏదో సందర్భంలో మాటా మాటా పెరిగి విడిపోవడమో లేదా తన్నుకోవడమో జరిగి స్నేహితులు తగ్గిపోవడం జరుగుతుంది. సన్యాసం పుచ్చుకుందామనే ఆలోచనలు అధికమగును. పరాయి స్త్రీలపై మక్కువ ఎక్కువగా ఉండును. చట్ట వ్యతిరేకమైన చేయు అవకాశము అధికము. కుటుంబంపై ప్రీతి తగ్గిపోతూ ఉంటుంది. ప్రేమ మనుషులు అయిననూ ఈర్ష్య, అసూయ, ద్వేషాలతో రగిలిపోతూ ఉండడం జరుగుతుంది. ఇతరుల మాటలకు త్వరగా లొంగిపోయి పూచీలు పడి ఆనక తీరిగ్గా విచారించడం మరియు ఆ అప్పులు తమవి కాకపోయిననూ నెత్తిన రుద్దుకొని కట్టాల్సి రావడం జరుగును. ఇంటిని వదిలి పారిపోవాలనే కోరిక బలీయమై ఒకానొక సందర్భంలో గృహాన్ని వదిలిపెట్టి వెళ్లిపోవడం కూడా జరుగుతుంది. దరిద్ర్యాన్ని రుచి చూడవలసి రావచ్చు. ఇంటి దొంగలచే పీడింపబడటం జరుగుతుంది. ముఖ పరిచయం సరిగా లేకపోయిననూ నమ్మి

మోసపోవడం జరుగును. ఇది చూడటానికి ఇతరులకు మహా విచిత్రంగా ఉంటుంది. నమ్మలేని విషయంగా ఉంటుంది. ఇటువంటి గృహాల్లో ఉన్నవారు ఉద్యోగస్థులు అయితే ఆఫీసులో ఏదో కాని పని చేసి దండనకు గురి కావచ్చు. అవమానాలు పొందడం జరుగుతుంది. సాధారణంగా ఇటువంటి వారు సస్పెన్షన్లకు గురి కావడం జరుగును.

ఈ గృహము యందలి స్త్రీలు మానసిక క్షోభకు అధికంగా గురి అవుదురు. ఒక్కోసారి మగవాళ్ల పైశాచికత్వానికి గురియై నలిగి పోవడం జరుగుతుంది.

**3. సంతానము :-** ఈ గృహానికి ఆగ్నేయ దోషములు ఉన్నట్లు అయితే గర్భ విచ్ఛిత్తి జరిగే అవకాశము ఉండవచ్చు. స్త్రీ జననం అధికంగా ఉండవచ్చు. వికలాంగత గోచరిస్తుంది. అలా కాకపోయిననూ యాక్సిడెంట్ రూపకంగా వికలాంగత ఏర్పడే అవకాశము గోచరిస్తుంది.

**4. విద్య :-** కష్టపడి చదివించాలని పెద్దలు ఎదురు చూసిననూ పిల్లలు మాట వినకపోవడం, విద్య సరిగా రాకపోవడం జరుగుతుంది. ఆటలాడుకునే పిల్లలు క్రిందపడి కాళ్లు విరుగగొట్టుకోవడం కూడా జరుగవచ్చు. పిల్లలు మంచి వారైననూ విద్యపై సరిగా దృష్టి నిలపలేరు. ఉద్యోగావకాశాలు తక్కువగా ఉంటాయి. కష్టపడి చదవడం కన్ననూ కాపీలు కొట్టి పాస్ కావాలనే ఆలోచనలు అధికంగా ఉంటాయి. నకిలి డిగ్రీల జోలికిపోయి జీవితానికి వెలుగు లేకుండా చేసుకోవడం జరుగుతుంది. ఇతరుల చేతిలో బంధీ కావడం కూడా జరుగును.

**కొన్ని లక్షణములు కల గృహములు :-**

1. విదిశా గృహాలలో ఈశాన్యమును హద్దు చేసుకొని ఏక ఎత్తు నిర్మాణం చేయడం మహాదోషము. ఇటువంటి గృహాలు అధికముగా నైరుతి రోడ్డు కల వాటిలో కనిపిస్తాయి. ఈ ప్రకారంగా ఈశాన్యము హద్దు చేసుకొని ఏక ఎత్తు నిర్మాణము జరిగినట్లు అయితే గృహములో వంశాంకురం హఠాత్తుగా చేయి విడిచిపెట్టి వెళ్లిపోవడము, మరణానికి గురి కావడము, కాళ్లూ చేతులు పోగొట్టుకోవడము, పూర్తిగా అభద్రతా భావానికి గురి కావడము, ఎంత ధనవంతులైననూ క్రమక్రమంగా క్షీణించి దరిద్ర్యులైపోవడము జరుగును. బాగా ఆరోగ్యుడై ఉన్న యజమాని కూడా ఒక్కసారిగా చుట్టుముట్టిన అనారోగ్యాలకు గురియై కుప్పకూలిపోవడం జరుగును. ఇక వ్యాపార విషయానికి వస్తే పకడ్బందీగా జరుగుతున్న వ్యాపారం కూడా అడ్రస్ లేకుండా పోవడం జరుగుతుంది. ఎన్నో కలలు కని ఎక్కడెక్కడో ధనాన్ని ప్రోగేసుకొని నిర్మించుకున్న వ్యాపార నిలయాలు అప్పుల పాలై సంస్థ కూలబడిపోవును.
2. నైరుతి రోడ్డు గల గృహమునకు ఇంటి ముందు అనగా నైరుతి భాగంలో వాలు వసారా వేసుకున్నట్లు అయితే వంశనాశనమో, ధన నాశనము సంభవించవచ్చును. ఈ ప్రాంతంలో ఖచ్చితంగా వసారా వేయవలసి ఉంటే చిన్న ఉపాయం పాటించడం ద్వారా అద్భుతమైన ఫలితాలు పొందవచ్చు. అది ఎలా అనగా వసారా భాగము గృహమును ఆనుకొని ఉన్న భాగము పల్లముగా ఉండులాగున మరియు రోడ్డు ప్రక్కకు ఉన చివరి భాగము మెరకగా ఉండు లాగున వేసుకున్నట్లు అయితే ఆరోగ్యము బాగా ఉండును. ఆర్థిక పుష్టి, భద్రతా భావం, స్థిరత్వం ఏర్పడును.
3. ఈశాన్య భాగము రోడ్డు గల గృహమునకు ఇంటి ముందు అరుగులు ఉన్నట్లు అయితే ఇంటి యందలి గర్భము కన్నా పల్లముగా మాత్రమే ఉండవలెను. అలా కాక ఇంటి ఫ్లోరింగ్ లెవెల్ కన్నా మెరకగా ఉన్నట్లు అయితే యజమాని ఎంత ఆర్థిక పరిపుష్టి కలిగిన వాడైననూ అధిక ఖర్చులతో మనశ్శాంతి లేని జీవితము ఏర్పడును. నెలకు ఎంత ఆదాయము వచ్చిననూ ఖర్చులకు తట్టుకోలేక ఋణము చేయవలసి వస్తుంది.
4. గృహమునకు ఇంటి ముందు మరియు ఇంటి వెనుక రెండు రోడ్లు ఉన్నట్లు అయితే ఒక రోడ్డును ఈశాన్యము రోడ్డు గానూ రెండవ రోడ్డును నైరుతి రోడ్డుగానూ తెలుసుకోవాలి. ఈశాన్యము రోడ్డు తక్కువ వైశాల్యం కలిగి నైరుతి రోడ్డు ఎక్కువ వైశాల్యం కలిగి ఉన్నట్లు అయితే అనారోగ్యాలతో పీడింపబడుతూ ఆర్థికంగా సరియైన విధానంతో ముందుకు సాగలేక కష్టములను ఎదుర్కోవలసి రావచ్చును. అప్పుల పాలవడం జరుగుతుంది. డబ్బు తీసుకున్న వారు సమయానికి అందించరు. ఇటువంటి గృహస్థులకు స్త్రీ సంతానము అధికంగా ఉండును. ఒకవేళ పుత్ర సంతానము ఉన్ననూ మందమతులుగా ఉందురు. ఇతరుల అభివృద్ధిని చూసి ఓర్వలేని తనముతో బాధపడడం జరుగుతుంది. దీనికి పరిష్కారముగా నైరుతిన ఏకెత్తు నిర్మాణము సాగించి ఈశాన్య భాగము ఎక్కువ ఖాళీ స్థలము

వచ్చు లాగున గృహమును నిర్మించుకోవడం వల్ల చెడు బాగా తగ్గిపోయి మంచి జరిగే అవకాశము అధికము.

5. విదిక్కుల యందలి గృహమునకు ఈశాన్య నైరుతులు తగ్గి వాయవ్య ఆగ్నేయములు పెరిగిన చందంగా ఉన్న గృహమునకు ఆగ్నేయ భాగమున రోడ్డు ఉండి ఇంటికి మరియు రోడ్డుకు మధ్యన నీళ్ల గుంతను ఏర్పాటు చేసుకొని ఉన్నట్లు అయితే వీరు త్వరగా ఇరుతల చేతిలో మోసపోవడం జరుగును. పరాయి స్త్రీల పొందు కోసం అతి రహస్యంగా ప్రయత్నాలు చేయుదురు. జ్ఞానం కలిగి ఉన్ననూ దుష్టతచే మనస్సు పీడింపబడుతూ ఉండి చెడు పనులు చేయడం జరుగును. కాని పనులు చేసి పబ్లిక్‌గా దొరికిపోవుదురు. గృహము తగులబడటము లేదా అగ్ని ప్రమాదాలచే తొందర కావడము, దొంగ తనాలకు అలవాటు పడటము, భార్యా భర్తల మధ్య అన్యోన్యత తక్కువగా ఉండటం, బిడ్డలు దుర్మార్గులు అవడము, బంధువర్గము వల్ల వీరు అశాంతికి గురి కావడమో లేదా వీరి వల్ల బంధువర్గపు అశాంతికి గురి కావడమో జరుగును. ఈ గృహస్థులు భార్యతో విడాకులు తీసుకోవడానికి ఎప్పుడూ ఏదో ఒక ప్రయత్నం చేస్తూ ఉంటారు లేదా పరాయి స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకోవడం జరుగవచ్చు. భర్త భార్యను పోగొట్టుకోవటమో లేదా భార్య భర్తను పోగొట్టుకోవడమో జరుగును. జైలుకు వెళ్లడం లేదా పోలీస్ స్టేషన్లకు వ్యవహార నిమిత్తమై వెళ్లటం జరుగుతుంది. అయితే అధికంగా పోలీసులే వీరిని పట్టుకుపోవడం జరుగుతుండవచ్చు. వీరు సాధారణంగా మూల వ్యాధిచే బాధ పడటం జరుగుతుంది. కోర్టు వ్యవహారాలు ఉండటం, కోర్టుల చుట్టూ తిరుగలేక ప్రత్యర్థితో రాజీ పడలేక వేదనకు గురి అవుదురు. వ్యాపార విషయానికి వస్తే ప్రభుత్వానికి పన్నులు ఎలా ఎగురగొట్టాలా అని యోచన చేసి చేసి తప్పు నిర్ణయాలు తీసుకొని అధికారులకు దొరికిపోవడం జరుగును. వ్యాపార వ్యవహారాలలో అలసత్వ దోషం వల్ల అధికారులకు దొరికి పోవడం జరుగవచ్చు.

6. “+” సైట్‌లో గృహమును ఈశాన్య ప్రాంతమున తక్కువ ఖాళీ స్థలము కలిగినట్లుగా నిర్మించుకొని నైరుతి భాగమున ఎక్కువ ఖాళీ స్థలము ఉండునటుల గృహ నిర్మాణం జరిగినట్లు అయితే ఈ గృహస్థులు అనేక రోగములతో బాధ పడుదురు. ఉదాహరణకు మూర్ఛ, ఉబ్బసము, బొల్లి మొదలగు వ్యాధులు కలుగుచుండును. ఈ పెరిగిన నైరుతి భాగమున నూతులు లేదా గోతులు ఉన్నట్లు అయితే ఆ గృహస్థులలో ఎవరో ఒకరు బలవంత మరణానికి గురి అవుదురు. వ్యభిచారంపై అధిక ప్రీతి కలిగిన వారై ఉండును. సంతాన నష్టము ఎక్కువగా ఉండు అవకాశము ఉంది. వీరికి ఇతరులతో శత్రుత్వం ఉన్న యెడల వారిని గెలవటమన్నది అతి కష్టం మీద మాత్రమే జరిగే అవకాశం ఉంది. ఇటువంటి గృహాలకు ఆగ్నేయ దోషమున్న హంతకులు ఉండడం కానీ లేదా హత్య కావింపబడటం కానీ జరుగును. ఇటువంటి గృహాలకు నైరుతిన ఏ ఇతర గృహాలు లేకుండా ఖాళీ స్థలములు ఉన్నట్లు అయితే గృహము యందలి ఆడ పిల్లలు లేచి పోవడము లేదా గృహస్థుడు ఇతర స్త్రీలను ఉంచుకోవడము జరుగును. వీరు మాంసాహారంపై ఎక్కువగా మక్కువ చూపుదురు. నీచ సావాసములతో క్రూరమైన పనులు చేయడానికి ఇష్టపడుదురు. ఇటువంటి గృహములలో శుభ శాతము కన్నా అశుభ శాతము అధికముగా ఉండును. వీరికి మృత్యు భయము అధికముగా ఉండును. అభద్రతా భావంతో బాధపడుతూ ఉండవచ్చు. అకస్మాత్ మరణాలు కూడా సంభవించవచ్చు. ఈ దోషములకు ఉపశమనము ఏమనగా ఎక్కువ ఖాళీ స్థలము కలిగిన నైరుతి భాగమున ఉపగృహం వేసుకోవడం వల్ల చాలా మటుకు దోషాలు హరించి పోవును. ఉప గృహం వేయడానికి అనుకూలం లేకపోతే బలమైన రాతి అరుగులను నిర్మించుకోవడం వల్ల కూడా మంచి ఫలితాలు లభించును. రాతి అరుగులను వేయటానికి కూడా అనుకూలం లేకపోతే ఇంటికి ప్రహరీలో ఈశాన్యము పాయింట్‌ను ఖచ్చితముగా కనుక్కొని అందు గుండ్రటి గుంతను ఏర్పాటు చేసుకోవాలి. విదిశ గృహాలకు ఈశాన్యము ఉత్తరము మరియు తూర్పుకు మధ్య భాగంలో ఉంటుంది. కాస్త అటూ ఇటూ అయినా గుంతను ఏర్పాటు చేసుకోవడం ఏ తొందరా లేదు. ఎందుకనగా ఒకటి లేదా రెండు అడుగులు గుంత తూర్పు లేదా ఉత్తర భాగములకు జరిగిననూ తూర్పు ఈశాన్యము లేదా ఉత్తర ఈశాన్యము అవుతుంది కదా! తూర్పు లేదా ఉత్తర ఈశాన్యములలో ఎక్కడ గుంత ఉన్ననూ గృహమునకు భాగ్యమే కదా.

7. “–” సైట్‌లో గృహమును నిర్మించుకొని వాయవ్య రోడ్డు యందు దారి ఉండి అక్కడ గుంతలు ఏవైనా ఉన్నట్లు

అయితే ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశము ఉంది. గుంతలు లేకుండగా గృహమునకు, ప్రహారీకి ఖాళీ స్థలము ఎక్కువగా ఉన్నట్లు అయితే ఎప్పుడూ ఇల్లు విడిచి బయట ప్రాంతములో ఎక్కువగా ఉండడం, కొద్ది దినాలు వ్యాపారం బాగా జరగడం, కొన్ని రోజులు వ్యాపారం ఏ మాత్రం సరిగా జరగకపోవడంలాగా ఉండును. ఏ విషయములోనైననూ ఎక్కువ నష్టాలను చూడవలసి ఉంటుంది. స్త్రీ సంతతి ఎక్కువగా ఉండడం జరుగును. ఏదో ఒక విషయంపై ఎప్పుడూ మానసిక వేదనకు గురి అవుతూ ఉంటారు. ఈ గృహము యందలి వారు సాధారణంగా ఎప్పుడూ ఇతర ప్రాంతాలకు వెళుతూ ఉంటారు. ఎక్కడికి వెళ్లిననూ మనశ్శాంతి లభించడం కష్టంగా ఉంటుంది. మితిమీరిన ఖర్చులు అధికంగా చేయుదురు. ఎంత కష్టమైననూ భరించే పరిస్థితులు ఉండడము, దారిద్ర్యాన్ని రుచి చూస్తుండడము, శ్రీమంతులు కూడా దరిద్ర్యంలో మగ్గి పోవడము, ఏదో ఒక వ్యవహారము నెత్తిపై ఉండడం, కోర్టు కేసులు, ఇతరత్రా బాధలతో వేదనలకు గురి అవుతూ ఉంటారు. వీరు సాధారణంగా ప్రమాణాలు చేస్తూ ఉంటారు. ప్రమాణాలు చేయాల్సిన పరిస్థితులు వీరికి ఎప్పుడూ ఎదురవుతూనే ఉంటాయి. నోటి మాట స్పష్టతను కోల్పోతూ ఉంటుంది. రహస్యంగా ఉండడానికి ఎక్కువ ఇష్టపడతారు. పగలు కన్నా రాత్రి వేళల యందు బయటకు తిరగడానికి ఎక్కువ ఇష్ట పడతారు. సూర్యాస్తమయం తర్వాత కాస్త హుషారుగా ఉండడం ఉంటుంది. రాత్రి అయ్యే కొద్దీ వీరికి ఒక బలం వచ్చినట్లుగా ఉంటుంది. రాత్రి ఎక్కువ మేల్కోవడానికి ఇష్ట పడతారు. అంతియేకాక రాత్రిళ్లు సరిగా నిద్ర పట్టదు. తెల్లవారిన తర్వాత కాస్త భయం భయంగా ఉంటారు. ఎక్కువగా వీరు ఊహా లోకంలో ఉంటారు. ఆ ఊహాలోకంలో మాత్రమే వీరు విజేతలు మరియు ధీరులు. నిజ జీవితంలో ప్రేలాపనలు పలికే వారిగా మాత్రమే ఉంటారు. అవసరమైన సమయంలో జారుకోవడం జరుగుతుంది. ఉన్నట్టుంది ధైర్యం రావడం, నిమిషాలలోనే పిరికితనం ఆవహించడం జరుగును. వీరికి పంటి బాధలు ఎక్కువగా ఉంటాయి. జుట్టు సమస్యలు మరియు జుట్టు ఊడి పోవడం అధికము. ఒక్కోసారి బ్రహ్మాండమైన పూజలు చేస్తారు. మరొకసారి దేవుడిపై నమ్మకాన్ని పోగొట్టుకుంటారు. సాధారణంగా వీరి కన్నా ఇబ్బందుల్లో ఉన్న వారే వీరికి ఆప్త మిత్రులుగా దొరుకుతారు.

ఒక్కొక్కసారి వ్యాపారంపై విపరీతమైన శ్రద్ధ కనపరిచి చిన్నపాటి లాభాలను ఆర్జిస్తారు. తదనంతరం తమ దగ్గర ఉన్న సొమ్ముతోనే కాకుండా ఇతరుల నుంచి కూడా ధనాన్ని అప్పుగా తీసుకొని పెట్టుబడి పెడతారు. అప్పుడు నావ మునిగిపోతుంది. అప్పుల వారి పోరు అధికమై బయట తిరగడమే మాని వేస్తారు. అప్పు వసూళ్ల కోసం సాధారణంగా ఎవరైనా ఉదయమే రావడం జరుగుతుంది కదా! ఇలా జరిగి జరిగి ఉదయం అంటేనే వీరికి భయం అధికం అవుతుంది. సాధారణంగా అప్పుల వారు రాత్రిళ్లు రారు కదా! కావున రాత్రిళ్లు ఎవరికీ భయ పడాల్సిన అవసరం ఉండదు. అందువల్ల రాత్రిళ్లు అంటే ఎక్కువ ఇష్ట పడతారు. పై పేరాలో వ్రాసిన వ్యాఖ్యాలకు ఇప్పుడు సులభ రీతిన అవగతమైనది కదా! ఫోన్ నెంబర్లను వీరు పదే పదే మారుస్తుంటారు. అయిన దానికి, కాని దానికి అబద్ధాలు ఎక్కువ చెప్పడం జరుగుతూ ఉంటుంది. అయితే ప్రతి ఒక్క అబద్ధానికి రీజనింగ్‌ను ఖచ్చితముగా చూపించే శక్తి వీరికుంటుంది. తమ గుంతను తామే తీసుకున్నట్లుగా ఇలాగ రోజు రోజుకు ఊబిలోకి కూరుకుపోతూ ఉంటారు. చివరకు తమ దగ్గర ఉన్న ఆస్థులను తక్కువ ధరకు అమ్ముకోవడం జరుగుతుంది లేదా అప్పుల వారికి కట్టబెట్టడం జరుగుతుంది. ఇదే ఫలితాలను ఇచ్చే ఈ గృహములో ఏళ్ల తరబడి ఉన్నట్లు అయితే వీరు జీవితాంతము మనస్ఫూర్తిగా భోగభాగ్యాలను అనుభవించలేరు. నిజమైన సంతోషాన్ని అసలు చూడలేరు. ఎందుకు పుట్టామా అని ఎప్పుడూ మదన పడుతూ ఉంటారు. ఎన్నో విషయాలు కలలో జరిగినట్లుగా భావించాల్సి ఉంటుంది. ఆత్మత్యాగం చేసుకోవాలని ప్రయత్నాలు చేసి అందులో కూడా విజయాన్ని సాధించలేరు. ప్రతి ఒక్క చిన్న సమస్యకు చావు తప్ప ఇంకొకటి పరిష్కారం లేదని ఎక్కువగా భావిస్తుంటారు.

**ఇందుకు పరిష్కారాలు :-**

ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇంటికి ఆగ్నేయ భాగంలో ఉప గృహము ఉండరాదు. ఉత్తరము నుంచి తూర్పు వరకు పారు తప్పకుండా వాలు వరండాలు వేసుకోవాలి. వాయవ్య భాగంలో గుబురుగా పెరిగే పాదులను నాటుకోవాలి. 7

అడుగులకు తక్కువ లేకుండా గల ఎత్తైన గోడను వాయవ్య భాగంలో ఏర్పాటు చేసుకోవాలి. ఈ గోడను కూడా పశ్చిమ మూల నుంచి కాకుండా ఉత్తర మూల నుంచి వెనుకకు అనగా పడమర దిశకు ముప్పాతిక శాతం వచ్చు లాగున నిర్మించుకోవడం ఉత్తమము. బలమైన గోడ నిర్మించరాదు. ఇంతకన్నా మంచి ఉపాయము ఏమనగా నాపరాళ్లను (బండరాళ్లు) ఈ గోడ బదులు నాటుకోవచ్చు లేదా తడికలు కట్టి వాటికి పాదులను అల్లించవచ్చు. స్వంత నిర్ణయము కన్నా అనుభవజ్ఞుడైన వాస్తు శాస్త్రవేత్త చేయడం వల్ల చెడు ఫలితాలను బాగా తగ్గించుకొని మంచి ఫలితాలను పొందవచ్చును. అలాకాకుండా స్వంత నిర్ణయాలు తీసుకోవడం వల్ల శుభ ఫలితాలు అంత త్వరగా చేతికి దక్కవు. పైగా చేయకూడని పని చేయడం వల్ల ముప్పు పెరగవచ్చు. మీ శ్రేయస్సు కోరి తెలియ జేయడమైనది.